క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పొంగులేటి ఆర్థిక సాయం


ఆర్థిక సాయమందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు అందించారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు ఆదివారం రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తకొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు బొల్లగాని వెంకటరామారావు, రావెళ్ల జ్యోతిబస్సు, విజయ్‌కుమార్, రాగూర్ రాంసింగ్, నీలం నాగేశ్వరరావు, చెరుకూరి సురేష్, కంకణాల శివాజీ, వత్సవాయి సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 134 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ పేషంట్లకు రూ.100కి నెలకు సరిపడా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏటుకూరి రామారావు, కార్యదర్శి కే.వీ.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, కొంగర నారాయణరావు, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, మంకెనపల్లి నరసింహారావు, వల్లంచెట్ల భాస్కర్‌రావు, భాస్కర్ రెడ్డి, అబ్దుల్ నబీ, సామాల మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించండి

నేలకొండపల్లి: బోదులబండ గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని బోదులబండ యువజన సంఘం ప్రతినిధి గుండు మహేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బాలయ్యకు చెందిన 16 గొర్రెలను ఇటీవల కుక్కల దాడి చేసి చంపేశాయని, దీంతో అతడికి రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గొర్రెల కాపరికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే రోడ్ల వెంట కుక్కలు యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలు, మూగజీవాలపై దాడి చేస్తున్నాయని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

'ప్రజా సమస్యలపై పోరాడేది బీజేపీనే'

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఐదు నియోజకవర్గాల్లో సాధించిన విజయాలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆదివారం ఒక పలు ఆరోపణలు చేశారు. ఈ విజయాలు ప్రజల తీర్పు వల్ల వచ్చాయా, లేక ఓట్ల చోరీ, ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం వల్ల వచ్చాయా అని ఆయన ప్రశ్నించారు. మీరు గెలిచిన స్థానాలకు తక్షణమే రాజీనామా చేసి, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని సవాలు విసిరారు. ప్రజాసమస్యలపై పోరాటం చేసిది బీజేపీ మాత్రమే అన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	శశివదనే, కాంతార, కిష్కింధపురి
సాయిరాం	అరి, కానిస్టేబుల్
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ట్రోన్, మిరాయ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	56		20
కాకర	46	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	40	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	66		20
బీట్‌రూట్	50	-ఖమ్మం వ్యవసాయం	

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్..


రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

- నేటి నుంచి పది రోజుల పాటు నిర్వహణ
- డ్రైవ్ విజయవంతంపై ప్రజాప్రతినిధుల అనుమానాలు
- అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు

ఖమ్మంమయూరిసెంటర్: సుందరీకరణతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛత నగరంగా ఖమ్మాన్ని తీర్చిదిద్దాలని అటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇటు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యలు నిరంతరం అధికారులతో సమీక్షిస్తున్నారు. నగరంలో పారిశుద్ధ్య పనులను బాధ్యతగా నిర్వర్తించాలని శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. ఈనేపథ్యాన పారిశుద్ధ్య సమస్యలు లేకుండా నేడు(సోమవారం) నుంచి పది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ సూచించడంతో డ్రైవ్ విజయవంతం అవుతుందా అనే అనుమానాలను ప్రజాప్రతినిధులు, నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి ఎటువంటి యాక్షన్ ప్లాన్ లేకుండా తయారు చేయకుండా పనులు చేపడితే సక్సెస్ ఎలా సాధ్యమవుతుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

60 డివిజన్లలో..

నగరంలోని 60 డివిజన్లలో ఈ పది రోజుల పాటు పారిశుద్ధ్య నిర్వహణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులలో డివైడర్ నుంచి డ్రెయిన్ వరకు రోడ్డును ఊడ్చడం, మట్టి, వ్యర్థాలు ఎత్తడం, డ్రెయినేజీలను శుభ్రం చేయం, డివిజన్లలోని అంతర్గత రహదారులను శుభ్రం చేయడంతో పాటు వాటి వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం వంటి పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు. స్వీపింగ్ మిషన్, జేసీబీలు అవసరమైన ప్రాంతాల్లో వినియోగించాలని సూచించారు. డివిజన్లలోని కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ తర్వాత స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు.

నిర్లక్ష్య ధోరణిలో..

కేఎంసీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఖమ్మం నగర కమిషనర్ పలుమార్లు నగరంలో గ్యాంగ్‌వర్క్‌లను ఏర్పాటు చేయించారు. అయితే ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో లక్ష్యాలు నెరవేరలేదు. కనీసం ప్రధాన రహదారులు కూడా శుభ్రం కాని పరిస్థితి నెలకొంది. రూ.లక్షలు ఖర్చు చేసి కార్మికులను, జేసీబీలు, ట్రాక్టర్లను సమకూర్చుకుని పనులు చేసినా ఫలితం లేదని, ఇప్పుడు పది రోజుల్లో అధికారులు ఈ పనులను ఎలా చక్కబెడతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పారిశుద్ధ్యంలో కీలకంగా ఉన్న అధికారి కనీసం స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆదివారం వరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయించడంలోనూ సదరు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే చర్చ కేఎంసీలో జరుగుతోంది. ఆయా డివిజన్లలో చేపట్టబోయే పనులపైతమకు కూడా సమాచారం ఇవ్వలేదని అధికారులపై కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి పవళింపు సేవ


స్వామి వారిని పల్లకీలో విహరింపజేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి వేంకటేశ్వరస్వామి 61వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం చివరి రోజున స్వామి వారికి ప్రాతరారాధన, ప్రాబోధకి, రాజభోగం వంటి కార్యక్రమాల అనంతరం రాత్రి పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొండకింది వేణుగోపాలాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు శేషభట్టర్ రఘునాథాచార్యులు, మధుసూదనాచార్యులు, కేశవాచార్యులు కార్యక్రమాలను నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ఖమ్మం ది ఐరన్ హార్డ్‌వేర్ అండ్ స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్ తోడ్పాటునిచ్చింది.

సీజేఐపై దాడికి వ్యతిరేకంగా నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడికి ప్రయత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరుతూ.. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మం జెడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు నల్లరిబ్బన్లు కట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీజేఐపై దాడి చేసిన వ్యక్తి దేశ ద్రోహితో సమానమని, అతడిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జస్టిస్ గవాయి ఒక దళితుడని మనువాద ముసుగులో సనాతన ధర్మం అంటూ దాడి చేస్తున్నారని, దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే దిశగా దేశ పౌరులందరూ ఒక తాటిపై వచ్చి సీజేకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకపుడి వీరస్వామి, దుపెల్లి శ్రీను, టీఎంహెచ్‌డీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పడిశాల వెంకన్న, ఆదోని బాలకృష్ణ, సత్తుపల్లి, మధిర, పాలేరు, ఇల్లెందు, ఖమ్మం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు బొడ్డు వెంకయ్య బాబు, జంగం వెంకయ్య, మునగలేటి వీరస్వామి, పిల్లిగుండ్ల ముత్తయ్య, దుప్పటి బాబురావు మాదిగ, మధు, జంగం నగేష్, ప్రజా సంఘాల నాయకులు బచ్చలకూరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకన్న, నాగరాజు, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.


సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో దోపిడీ


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మం మామిళ్లగూడెం: సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో వందల కోట్ల రూపాయాల భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను కాజేస్తున్నారని, వెంటనే ఈ టెస్టులు నిలిపివేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కార్డు ఉన్న కార్మికులకు ఫోన్లు చేసి మీరు ఫలానా దగ్గరికి వచ్చి టెస్టులు చేయించుకోకపోతే మీ లేబర్ కార్డు రద్దవుతుందని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ బెదిరింపులు ఆపకపోతే సీఎస్సీ సెంటర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు డోనోజు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మేడికొండ నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి టీ.వీ.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మూసుకుపోతున్న రోడ్లు..


పండితాపురం-బండిపాడు రోడ్డును కమ్మేసిన పిచ్చి మొక్కలు

మండలంలోని పండితాపురం-బండిపాడు, కామేపల్లి-జాస్తిపల్లి, కామేపల్లి-కెప్టెన్‌బంజర బీటీ రోడ్లను పిచ్చి మొక్కలు కమ్మేశాయి. దీంతో రాత్రి సమయాన ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపులా పెరిగిన మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. - కామేపల్లి

నియామకాలు

➡ బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరవెల్లి రాజేష్ గుప్తా


వీరవెల్లి రాజేష్ గుప్తా

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరవెల్లి రాజేష్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.


➡ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మి, మల్లేష్


తుళ్లూరు లక్ష్మి


గుండెపొంగు మల్లేష్

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుళ్లూరు లక్ష్మి, గుండెపొంగు మల్లేష్‌లు ఎన్నికయ్యారు. శనివారం తల్లాడ మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా 2వ మహాసభలో ఎన్నుకున్నట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 45 మందితో కౌన్సిల్ ఏర్పాటు చేయగా.. గౌరవ అధ్యక్షుడిగా నిమ్మటూరి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహాదేవ లక్ష్మి, ఉపాధ్యక్షులుగా మండవ కృష్ణకుమారి, లక్ష్మి, సత్యవతి, కుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రంజాన్ బీ, సహాయ కార్యదర్శులుగా రహీమున్నీసా, కరుణ, సూరమ్మ, అన్నమ్మ, వెంకటమ్మలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సన్మానం


గురుప్రసాద్‌ను సన్మానిస్తున్న యూనియన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గురుప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీపీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణన్, చంద్రశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొని గురుప్రసాద్ సేవలను కొనియాడారు. అనంతరం టీపీటీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పుట్టా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పడిగ రవికుమార్‌లను ఎన్నుకున్నారు.

నివాళి

తిరుమలాయపాలెం: స్వర్గీయ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి దశ దిన కర్మ సందర్భంగా ఆదివారం తుంగతుర్తిలో జరిగిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి హనుమంతరావు, షేక్.కరీం, బోడ సుదర్శన్, నల్లబెల్లి లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

'ఓటు చోరీ'కి మద్దతుగా సంతకాల సేకరణ


మాట్లాడుతున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని, అక్రమంగా ఓటర్ల పేర్లు తొలగిస్తుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఆదివారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు మేరకు నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని జీపీల్లో ఇంటింటికి వెళ్లి 'ఓటు హక్కు వినియోగం – ప్రజాస్వామ్య రక్షణ' పేరుతో సంతకాల సేకరణ చేపట్టారు. ముస్తఫానగర్‌లో భారీ ర్యాలీ తీసి రోడ్‌షో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మచైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకుడోత్ దీపక్, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌తో పాటు సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, తాతా రఘురాం, తుపాకుల యలగొండస్వామి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని బూత్ స్థాయిలో పత్రాలను నింపి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని, రాహుల్ గాంధీ చేపట్టిన ఈ ఉద్యమానికి సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ ప్రధాన బాధ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 50వ డివిజన్‌లో కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బిరెడ్డి రమేష్ ఆధ్వర్యాన గడప–గడపకు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టగా.. డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఉమర్, శ్రీను, గిరి, గంటా భీమయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రూపక్, పవన్ ,హరిలాల్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించే వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రశాంత వాతావరణం ఉన్న నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలోకి బయట ప్రాంతానికి చెందిన వ్యక్తి కొంత మందిని తీసుకొచ్చి బెదిరింపులకు పాల్పడుతుంటే నగర పోలీసులు మౌనంగా ఉండడం ఏంటని ప్రశ్నించారు. ఆస్తి పంచాయతీ పేరుతో అరాచకాలు, బెదిరింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకొని శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, జిల్లా నాయకులు కె.శ్రీను, శిరోమణి, శోభ, ఇమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 16న 'చాంబర్' ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీల మూడేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో నూతన కమిటీ ఎన్నికకు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుత కమిటీల పదవీ కాలపరిమితి పూర్తి కావడంతో సంప్రదాయ విధానం, నిబంధనలకు అనుగుణంగా చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ ఆదివారం నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించింది. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత సంఘం ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం సంఘం నిర్వహించిన కార్యకలాపాలపై రూపొందించిన నివేదికను వినిపించారు. కోశాధ్యక్షుడు తల్లాడ రమేష్ సంఘం కార్యకలాపాలకు వినియోగించిన ఆదాయ, వ్యయాలు వంటి అంశాలపై నివేదిక వినిపించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ.. మూడేళ్ల కాలంలో చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహణ వ్యాపారులు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి చేసిన కృషి తదితర అంశాలను వివరించారు. అనంతరం సభ్యులు ఆమోదం మేరకు నవంబర్ 16గా ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పీ.బీ.శ్రీరాములు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రస్తుత ఉపాధ్యక్షులు సోమా నర్సింహారావు(జీ.వై.నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, మాజీ అధ్యక్షులు కొప్పు నరేష్, మాజీ ప్రధాన కార్యదర్శి గొడవర్తి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం.. ధ్వంసం

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి గ్రామంలో శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆ శిలాఫలక దిమ్మెను పడగొట్టి, బోర్డును పక్కకు పడేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడకు చేరుకుని పరిశీలించి గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తుంటే తట్టుకోలేక ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


ధ్వంసమైన శిలాఫలకం

ఏడాది కష్టాలకు చెక్..


పూర్తయిన స్లాబ్ కల్వర్టు, తారు రోడ్డు

- కోయచలక–కోటపాడు మధ్య రాకపోకలు పునఃప్రారంభం
- గతేడాది వరదకు దెబ్బతిన్న కల్వర్టు, రోడ్డు
- రూ.73 లక్షలతో పూర్తయిన పనులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక–పాపటపల్లి రోడ్డులో కోయచలక మధ్య దెబ్బతిన్న స్లాబ్ కల్వర్టు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. గతేడాది సెప్టెంబర్‌లో భారీ వర్షాల కారణంగా ఈ రహదారిపై ఉన్న స్లాబ్ కల్వర్టు, తారురోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. నాటి నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

రూ.73 లక్షల అంచనాతో..

వరద ధాటికి కొట్టుకుపోయిన స్లాబ్ కల్వర్టు, రోడ్డుకు తాత్కాలికంగా అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పించారు. అయితే శాశ్వత పరిష్కారం కోసం సుమారు రూ.73 లక్షల అంచనాతో కొత్త స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పూర్తయి, నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

సౌకర్యవంతంగా రాకపోకలు..

ప్రస్తుతం కల్వర్టు నిర్మాణంతో పాటు దానిపై తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో రవాణా సౌకర్యం తిరిగి ప్రారంభమై ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కోతకు గురైన రహదారి పూర్తిస్థాయిలో పునరుద్ధరించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులను ప్రోత్సహించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.